AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

20-7-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ఘనంగా అంతర్జాతీయ చెస్ దినోత్సవం



**అక్షరటుడే, భీమ్‌గల్:** అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమ్‌గల్‌లోని గంగా విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో చదరంగం పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాఠశాలకు చెందిన 35 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో 7వ తరగతి విద్యార్థి సుశ్రుత్ ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, 5వ తరగతి విద్యార్థి వరుణ్ తేజ ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్ కుమార్, పీఈటీ విశాల్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ సాగు ఉత్తమం: సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సూపర్ ఎల్‌నినో కారణంగా ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఎంతో శ్రేయస్కరమని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని శ్రీరాంసాగర్, నిజాంసాగర్, కౌలాస్ నాలా, పోచారం, సింగితం, కల్యాణి తదితర రిజర్వాయర్లలో నీటిమట్టంపై ముందుగా చర్చించారు. అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల స్థితి, తాగునీటి సరఫరా తీరుతెన్నులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వివరించారు. తక్కువ నీటితో ఏయే పంటలను సాగు చేయవచ్చు, ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేయవచ్చనే విషయాలను వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు, ఆదర్శ రైతులు తమ అనుభవపూర్వక అంశాలను వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో చేపట్టనున్న ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక గురించి కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్‌లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, లక్ష్మీకాంత రావు, పైడి రాకేశ్ రెడ్డి, భూపతి రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ తారిక్ అన్సారి, మేయర్ ఉమారాణి, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, సీపీ సాయి చైతన్య, ఎస్పీ రాజేష్ చంద్ర, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పాల్గొన్నారు.

### తెయూ సమాచారం

## ప్రారంభమైన ఇంటిగ్రేటెడ్ పరీక్షలు

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల థియరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన పరీక్షలకు ఐదుగురు విద్యార్థులకు నలుగురు, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 12 మంది విద్యార్థులకు 10 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే తెలంగాణ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం జరిగిన పరీక్షకు 39 మంది విద్యార్థులకు 35 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు ఏడుగురు విద్యార్థులకు ఆరుగురు విద్యార్థులు హాజరైనట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల 1, 2, 3, 4, 5, 6 సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ వన్ టైమ్ ఛాన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఉదయం జరిగిన పరీక్షలకు 94 మంది విద్యార్థులకు 73 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 90 మంది విద్యార్థులకు 83 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ వివరించారు.





# ఆర్మూర్‌లో హైటెన్షన్..

**ఆర్మూర్‌లో సోమవారం హై టెన్షన్ వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ బీజేపీ నేతల పోటాపోటీ సవాళ్లు.. ప్రతి సవాళ్లతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. బీఎన్ఎస్ 163ని ప్రయోగించింది. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, పొద్దుటూరి వినయ్‌కుమార్‌లను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. అయితే అంకాపూర్‌లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు పలువురు కాంగ్రెస్ నాయకులు యత్నించగా ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.**

**– అక్షరటుడే, ఆర్మూర్**

- **సవాళ్లు.. ప్రతిసవాళ్లతో ఉద్రిక్తత**
- **ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ధన్‌పాల్ హౌస్ అరెస్ట్**
- **ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి సైతం..**
- **పోలీసుల దిగ్బంధనలో అంకాపూర్..**

కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'చలో అంకాపూర్'కు పిలుపునివ్వడం.. ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం కాంగ్రెస్ ఆర్మూర్ నియోజక వర్గం వినయ్ కుమార్ రెడ్డిని పీవీఆర్ భవన్‌లో పోలీసులు ఉదయాన్నే హౌస్ అరెస్ట్ చేశారు. మరోవైపు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అంకాపూర్‌లోని తన నివాసంలో బీజేపీ నాయకులతో ఉదయాన్నే సమావేశం కాగా పోలీసులు ఆయనను సైతం హౌస్ అరెస్ట్ చేశారు.



### బీజేపీ, కాంగ్రెస్ నేతల అరెస్ట్..

అంకాపూర్‌లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆర్మూర్‌కు బయలుదేరగా ఆయనను సైతం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మరోవైపు ఆర్మూర్, నందిపేట్, మాక్లూర్, ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నేతలు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి ఆయా మండలాల పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మరోవైపు రాకేష్ రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో అంకాపూర్‌లో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.

### 'కాంగ్రెస్ నాయకుల బంగారు గొలుసులు లాక్కోండి..'

కళ్యాణ లక్ష్మి పథకంలో భాగంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టుగా ఆ పార్టీ నేతల మెడలలోని బంగారు గొలుసులు లాక్కోవాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వ్యాఖ్యానించారు. విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విషయంలో మహిళలకు తాను అండగా ఉంటానన్నారు. మహిళలు ధైర్యంగా ఆ బంగారు గొలుసులు అమ్మేసి తనకు రిసిప్ట్ పెట్టాలని సూచించారు. స్కూటీలు ఇస్తామని సైతం హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ నాయకుల షోరూంలో నుంచి స్కూటీలు సైతం ఎత్తుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని త్వరలోనే గద్దె దింపుతామన్నారు. మరోవైపు జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి రాకేష్ రెడ్డి మద్దతుగా అంకాపూర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులతో చర్చకు రాకేష్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని పోలీసులు ఆయనను హౌస్ అరెస్ట్ చేయడం తగదన్నారు. ఆర్మూర్, ఇందూర్ అభివృద్ధి ఎవరు అడ్డుకుంటున్నారో అందరికీ తెలుసన్నారు.

### 'సొంత ఊరులోనే సర్పంచ్‌ను గెలిపించుకోలేకపోయాడు..'

అంకాపూర్ గ్రామంలోనే సర్పంచ్ గెలిపించుకోలేని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తరచూ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లకు తరచూ సవాళ్లు విసరడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. పోలీసులు హౌస్ అరెస్ట్ చేయగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15న నిజామాబాద్‌లో బీజేపీ రణభేరిలో కాంగ్రెస్ పార్టీపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలే 'చలో అంకాపూర్' పిలుపునకు దారితీసిందన్నారు. పీసీసీ చీఫ్‌ను రాజీనామా చేసి పోటీ చేయాలని పిలిచే అవసరం లేదని.. ఇక్కడ పోటీకి తాను సిద్ధంగా ఉన్నానని వినయ్ రెడ్డి అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో 86 గ్రామ పంచాయతీలకు బీజేపీ 11 సర్పంచ్ స్థానాలు గెలిస్తే 66 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుందని ఆయన గుర్తు చేశారు.

## బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా రత్నగారి వంశీ గౌడ్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తెలంగాణ భారత జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా అధ్యక్షుల ఎన్నికలు పూర్తయ్యాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆదేశాల మేరకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే జిల్లా అధ్యక్షుల వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రత్నగారి వంశీ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. ఈ భారతీయ జనతా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు రాకేష్ రెడ్డి, ధన్‌పాల్‌కు, పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డికి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా క్రమశిక్షణతో, అంకితభావంతో పని చేస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తానని రత్నగారి వంశీగౌడ్ తెలిపారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 22 అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇందూర్ గంగాధర్ తెలిపారు. ఖాళీ పోస్టుల్లో ఇంగ్లీష్-2, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్-2, తెలుగు-1, ఉర్దూ-1, హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్-1, ఎకనామిక్స్-1, కామర్స్-1, బీఎఫ్ఎస్ఐ-1, బోటనీ-1, కెమిస్ట్రీ-1, క్రాప్ ప్రొడక్షన్-1, హెల్త్ కేర్-1, మ్యాథమెటిక్స్-1 ఉన్నాయి. అలాగే ఉర్దూ మీడియంలో హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్-1, ఎకనామిక్స్-1, బోటనీ-1, కెమిస్ట్రీ-1, జువాలజీ-1 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇంటర్వ్యూలు జూలై 22 ఉదయం 10 గంటలకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ వెల్లడించారు.

## బీఆర్ఎస్‌లో చేరిన వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్ సోమవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆ పార్టీలో తిరిగి చేరారు. కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. మోరిల్ శ్రీనివాస్ గతంలో బీఆర్ఎస్ పార్టీలో చురుకుగా పనిచేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి వర్గంలో కీలకంగా వ్యవహరించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నాయకులు, కార్యకర్తల సమన్వయంలో చురుకైన పాత్ర పోషించారు. అయితే ఇటీవల రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన శ్రీనివాస్ తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్‌లో స్థానం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే పార్టీ లక్ష్యమని, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి అందరూ సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరాలయంలో పీసీసీ చీఫ్ ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం శ్రద్ధానంద్ గంజ్ ఉమా మహేశ్వర ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య జలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పరమేశ్వరుడిని ప్రార్థించినట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నగేష్ రెడ్డి, కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## మహాలక్ష్మి అమ్మవారి ఆలయాభివృద్ధికి కృషి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతోనే రాజకీయంలో రాణిస్తూ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నానని.. ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. జలాల్‌పూర్‌లో ఆయన సోమవారం పర్యటించారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బాలాపురం రుక్మాబాయి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బాలాపురం గంగారెడ్డి, లక్ష్మారెడ్డి, భాస్కర్ రెడ్డి (దాతలు) సహకారంతో నిర్మించిన నూతన వంటశాల, భోజన శాలను ప్రారంభించారు. అనంతరం దాతలను ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార కార్పొరేషన్ ఛైర్మన్ శేఖర్ గౌడ్, ఐసీడీఎంఎస్ మాజీ ఛైర్మన్లు సాయ రెడ్డి, తారాచంద్, నాయకులు పాల్గొన్నారు.

## బస్సుల కోసం విద్యార్థుల ధర్నా..

**అక్షరటుడే, కామారెడ్డి:** బస్‌స్టాప్‌లలో బస్సులను ఆపకపోవడంతో తాము సమయానికి కళాశాలలు, పాఠశాలలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు. ఈ సందర్భంగా సోమవారం వారు రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ ఘటన సోమవారం కామారెడ్డి మండలం లింగాయిపల్లి, కోటాల్ పల్లి స్టేజి వద్ద చోటుచేసుకుంది. సోమవారం ఉదయం ఎప్పటిలాగే విద్యార్థులు రెండు గ్రామాల నుంచి వచ్చి కామారెడ్డి - రాజంపేట రోడ్డుపై స్టేజ్ వద్ద వేచి ఉన్నారు. వచ్చిన బస్సులు వచ్చినట్టు ఆపకుండా వెళ్లిపోతుండడంతో విద్యార్థులు సహనం కోల్పోయి రహదారిపై బైఠాయించారు. కామారెడ్డి నుంచి గుండారం వెళ్లే బస్సులు వచ్చేటప్పుడు జనాల రద్దీతో ఆపకుండా వెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి నుంచి ఆర్గొండ, గుండారం, మెదక్ వరకు బస్సులు వెళ్తాయని, వచ్చేటప్పుడు జనాలు నిండుగా వస్తున్నారన్నారు. దాంతో తమ స్టేజీ వద్ద బస్సులు ఆపడం లేదని, ఫలితంగా కళాశాలలు, పాఠశాలలకు ఆలస్యంగా వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న దేవునిపల్లి ఎస్సై రంజిత్ కుమార్ ఘటనాస్థలికి వెళ్లి నచ్చజెప్పారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. దాంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. అనంతరం యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధల నాగరాజ్, కార్యదర్శి సతీష్ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.



## బహ్రెయిన్ 'ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్' అధ్యక్షుడి రాజీనామా



**అక్షరటుడే, భీమ్‌గల్:** బహ్రెయిన్ ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్ష పదవికి భీమ్‌గల్ మండలం బాబానగర్ గ్రామానికి చెందిన తోట రమేశ్ రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడికి పంపినట్లు తెలిపారు. అనివార్య కారణాల వల్ల తాను ఇటీవల స్వదేశానికి తిరిగి వచ్చిన నేపథ్యంలో, ఈ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు తోట రమేశ్ ప్రకటించారు. గత ఐదేళ్లుగా యూనియన్ అధ్యక్షుడిగా కొనసాగుతూ కార్మికుల సంక్షేమానికి, హక్కుల రక్షణకు కృషి చేసే అవకాశం కల్పించినందుకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం బహ్రెయిన్‌లో ఉన్న క్రియాశీల సభ్యులలో ఒకరిని నూతన అధ్యక్షుడిగా ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించాలని లేఖలో సూచించారు. తన రాజీనామాను తక్షణమే ఆమోదించాల్సిందిగా యూనియన్ యాజమాన్యానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

## కామారెడ్డిలో దొంగల హల్‌చల్.. విద్యుత్ ఉద్యోగి ఇంట్లో చోరీ



**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీసులు నిఘా పెడుతున్నప్పటికి చోరీలు ఆగడం లేదు. దొంగలు చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాజాగా దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో ఓ విద్యుత్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. సదాశివనగర్ మండలం లో ఏఈగా పనిచేస్తున్న గంగాధర్ ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం సదరు ఉద్యోగి కుటుంబంతో కలిసి గంభీరావుపేటలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని బీరువాలో ఉంచిన 3 తులాల బంగారు గొలుసు, 20 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులు క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందించడం జవహర్ నవోదయ విద్యాలయాల ప్రత్యేకత. ఈ విద్యాలయాల్లో సీటు సాధించిన విద్యార్థులు ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు నిశ్చింతగా చదువుకునే సువర్ణావకాశం ఉంది. జవహర్ నవోదయ విద్యాలయంలో 2027-28 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సీబీఎస్ఈ విధానంలో ప్రవేశ పరీక్ష నుంచి ఎంపిక వరకు ఢిల్లీలోని ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ప్రక్రియ జరుగుతుంది. – అక్షరటుడే, ఎల్లారెడ్డి

# నవీన విద్యకు నవోదయం

- నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- 'కార్పొరేట్'కు దీటుగా విద్యాబోధన
- ఈనెల 30 వరకు అప్లికేషన్ల స్వీకరణ
- పారదర్శకంగా ఎంపిక విధానం
- దళారులను నమ్మొద్దని అధికారుల సూచన

నేటి రోజుల్లో కార్పొరేట్ విద్యను ఉచితంగా అందిస్తోంది జవహర్ నవోదయ విద్యాలయం. కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించాలంటే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే కార్పొరేట్‌కు దీటుగా ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన విద్యా బోధనను ఈ విద్యాసంస్థల్లో అందిస్తారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన వసతి గృహాలు, క్రీడా మైదానాలు ఇలా అన్ని సౌకర్యాలు ఉంటాయి. అలాగే పాఠశాల సిబ్బందికి సైతం అక్కడే వసతి ఉండడంతో ఎల్లవేళలా వారి పర్యవేక్షణ ఉంటుంది. ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్ లాంటి క్రమశిక్షణ అలవర్చే కార్యక్రమాలు నిర్వహిస్తారు. నవోదయలో చేరేందుకు ఆసక్తి ఉండి ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాల బాలికలు జూలై 30 2026లోపు అధికారిక నవోదయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు కామన్ సర్వీసెస్ సెంటర్ల ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారాలను నవోదయ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష..

విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి గాను ఆ స్థాయిలోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి విభాగంలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. 100 మార్కులకు గాను 80 ప్రశ్నలుంటాయి. ఇందులో మెంటల్ ఎబిలిటీ, అంకగణితం (మ్యాథ్స్), భాషా పరీక్షకు (తెలుగు లేదా ఇంగ్లిష్) సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. అర్హత సాధించిన విద్యార్థులకు మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

### ప్రవేశ పరీక్ష నవంబర్ 28న..

దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01-05-2015 నుంచి 31-07-2017 మధ్య జన్మించిన వారై ఉండాలి. జూలై 2026-27 విద్యా సంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతూ ఉండాలి. ప్రవేశ పరీక్ష నవంబరు 28న 2026న జరుగుతుంది. ప్రవేశ పరీక్షల్లో 80 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. వీరిలో 75 శాతం మంది గ్రామీణ ప్రాంతం నుంచి, మిగిలిన వారిని పట్టణాల నుంచి ఎంపిక చేస్తారు. ఫలితాలు మార్చిలో ప్రకటిస్తారు.

### సద్వినియోగం చేసుకోవాలి

జవహర్ నవోదయలో ప్రవేశానికి గ్రామీణ ప్రాంత విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు కొంచెం కష్టపడి చదివి, పరీక్ష రాస్తే సీటు సులభంగా వస్తుంది. నవోదయ విద్యాలయంలో సీట్లు ఇప్పిస్తామంటూ చెప్పే మధ్య దళారులను నమ్మొద్దు. సీబీఎస్ఈ విధానంలో ప్రవేశ పరీక్ష మొదలు ఎంపిక వరకు ఢిల్లీలోని ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో పారదర్శకంగా జరుగుతుంది.

– సీతారాం బాబు, నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్



## ముప్కాల్ ఎన్యూమరేషన్ కేంద్రం పరిశీలన

**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలోని రైతు వేదికలో కొనసాగుతున్న ఓటర్ల ఎన్యూమరేషన్ కేంద్రాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో మిగిలి ఉన్న ఒకటి, రెండు శాతం ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బీఎల్వోలు, బీఎల్ఏలకు సూచించారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు నమోదయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ముంతాబొద్దీన్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## తాగునీటి సౌకర్యం కల్పించాలని ఫిర్యాదు

**అక్షటుడే, పెద్దకొడప్‌గల్ :** తాగునీటి సౌకర్యం కల్పించాలని పెద్దకొడప్‌గల్ మండలానికి చెందిన బీజేపీ నాయకుడు తానాజీరావు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో ఏడాది కాలం నుంచి పాపనేశ్వర దేవస్థానం నుంచి ప్లాట్లలో వచ్చే మంచినీటి సరఫరా బోరు చెడిపోవడంతో నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. దీంతో పాటు మిషన్ భగీరథ నీళ్లు కూడా సరిగ్గా రాకపోవడంతో సుమారు ఈ ప్లాట్లలో ఉండే 100 కుటుంబాల ప్రజలు మంచి నీటికోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌ను ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవట్లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.



## సరస్వతి శిశుమందిర్ పాఠశాల నిర్మాణానికి సిమెంట్ వితరణ

**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు సోమవారం బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి ఎల్లారెడ్డి 1000 సిమెంట్ బస్తాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో పిల్లలు ఉన్నతంగా, దేశంపై ప్రేమ ఉండాలంటే సరస్వతి శిశు మందిరం పాఠశాలలోనే విలువలతో కూడిన విద్యను అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారి సభ్యులు కొత్త దుర్గయ్య, పెద్ది శివయ్య, జంగం రాజేశ్వర్, అంకం గంగాధర్, బాలరాజ్ గౌడ్, దివిటి రాజు దాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణ యత్నంపై విచారణ జరపాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని 13వ డివిజన్ పరిధిలోని సారంగాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణ యత్నంపై విచారణ జరపాలని బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌ఛార్జ్ అక్బర్ నవాజుద్దీన్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్పొరేటర్ మద్దతుతో ఈ ఆక్రమణ జరిగినట్లు తెలుస్తోందన్నారు. తక్షణమే ఈ ఘటనపై రెవెన్యూ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆక్రమణకు గురైన భూమి సర్వే నంబర్, విస్తీర్ణం, వర్గీకరణను స్పష్టం చేయాలన్నారు. పేదలను తప్పుదారి పట్టించి ఆక్రమణలను ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద చట్టబద్ధంగా పట్టా సర్టిఫికెట్లు, స్థలాలు కేటాయించాలి. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఇళ్ల స్థలాల పొందే విధానంపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులచే ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు.

## మెండోరా కేజీబీవీకి వాటర్‌పంప్ అందజేత




**అక్షరటుడే, మెండోరా:** మెండోరా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో వాటర్ పంపు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొత్తింటి ముత్యం రెడ్డి స్పందించి రూ.15వేల విలువైన వాటర్ పంపును పాఠశాల ప్రత్యేక అధికారి (ఎస్‌వో) పద్మకు అందజేశారు. ఈ సందర్భంగా ముత్యం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు విద్యపై దృష్టి సారించి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. హాస్టల్‌లో అవసరమైన మౌలిక వసతుల గురించి తన దృష్టికి తీసుకువస్తే, తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రత్యేక అధికారి పద్మ మాట్లాడుతూ.. పాఠశాల అవసరాన్ని గుర్తించి వెంటనే స్పందించి వాటర్ పంపును అందించిన ముత్యం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సహాయ సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఏటీసీ సెంటర్‌ను కామారెడ్డిలోనే ఏర్పాటు చేయాలి




**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి నియోజకవర్గానికి మంజూరైన ప్రభుత్వ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను భిక్కనూర్ మండలం గుర్జకుంటలో కాకుండా జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని విద్యార్థి సేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను పెంచే ప్రతిష్ఠాత్మక సంస్థ అని తెలిపారు. అందువల్ల జిల్లాలోని అన్ని మండలాల విద్యార్థులకు సులభంగా అందుబాటులో ఉండేలా జిల్లా కేంద్రంలోనే దీన్ని నెలకొల్పాలని కోరారు. గుర్జకుంటలో ఏటీసీని ఏర్పాటు చేస్తే దూర ప్రాంతాల విద్యార్థులు ప్రతిరోజూ రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా, వసతి, వైద్య సేవలు, ఇతర మౌలిక వసతుల పరంగా జిల్లా కేంద్రమే అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని వివరించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, హాస్టళ్లు, బస్సు, రైల్వే సౌకర్యాలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని ప్రతి మండలం నుంచి విద్యార్థులు సులభంగా చేరుకుని నాణ్యమైన సాంకేతిక విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, సమాన అవకాశాలు, అందుబాటు

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. ప్రాణాలు కాపాడిన పోలీసులు



**అక్షరటుడే, కామారెడ్డి:** ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఓ వ్యక్తిని పోలీసులు సమయస్ఫూర్తితో కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి కామారెడ్డి పట్టణంలోని ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే కామారెడ్డి పోలీసు సిబ్బంది, బీట్ కానిస్టేబుల్ అరుణ్‌తో పాటు ఇతర సిబ్బంది వెంటనే గాలింపు చేపట్టారు. కేవలం 10 నిమిషాల్లోనే ఆ వ్యక్తి రైల్వే ట్రాక్‌పై ఉన్నట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. ప్రతి ప్రాణం అమూల్యమైనదని, ఏ సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాదన్నారు. ఆపదలో ఉన్నవారు వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం ఇస్తే పోలీసులు తక్షణమే స్పందిస్తారని తెలిపారు. మానసిక ఒత్తిడి లేదా నిరాశతో ఎవరూ ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

## బిడ్డపై బ్లేడ్‌తో దాడి చేసిన తండ్రి, సవతి తల్లి అరెస్ట్..




**అక్షరటుడే, కామారెడ్డి:** పోషించడం భారంగా భావించి సొంత కూతురినే కడతేర్చేందుకు తండ్రి, సవతి తల్లి కుట్ర పన్నారు. ఏడు నెలల చిన్నారిని బ్లేడుతో గాట్లు పెట్టి.. కుక్కలు కరిచాయని కట్టుకథ అల్లారు. ఎట్టకేలకు వారిద్దరు కటకటాల పాలయ్యారు. బీర్కూర్ మండలంలో జరిగిన ఈ ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ మేరకు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. రెండేళ్ల క్రితం సంకు శైలజ భర్త టేకు సతీష్‌ను ఆమె చెల్లెలు సంధ్య రెండో వివాహం చేసుకుంది. వారికి వైష్ణవి అనే కూతురు పుట్టింది. అయితే దాంపత్య విభేదాలతో పెద్దల సమక్షంలో విడిపోయి చిన్నారిని సతీష్ దగ్గరే ఉంచారు. ఈనెల 15న ఉదయం ఇంట్లో చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా, ఇంటి సమీపంలోని ముళ్ల పొదల్లో తీవ్ర గాయాలతో వైష్ణవి అపస్మారక స్థితిలో లభించింది. వెంటనే బాన్సువాడ, నిజామాబాద్ ఆస్పత్రులకు తరలించి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై సంధ్య తన అక్క శైలజపై అనుమానం వ్యక్తంచేస్తూ బీర్కూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల దర్యాప్తులో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, బీర్కూర్ ఎస్సై రాములు, పిట్లం ఎస్సై ఆంజనేయులు కేసును ఛేదించారు.

## కోనాపూర్ పాఠశాలకు డెస్క్ బెంచీల వితరణ




**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని జడ్పీహెచ్‌పీఎస్ కోనాపూర్ పాఠశాలకు 15 డ్యూయల్ డెస్క్ బెంచీలను చిట్టాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద రెడ్డి అందజేశారు. తన వసంత టూల్ క్రాఫ్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రూ.62వేల విలువైన బెంచీలను పాఠశాలకు అందచేశారు. వారికి కోనాపూర్ సర్పంచ్ అరుణ్ రెడ్డి, ఉప సర్పంచ్ ఉదయ్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చౌడారపు రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నవీన్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియచేశారు. అలాగే పీఎంశ్రీ చౌట్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌కు రూ.62వేల విలువైన 15 డెస్క్ బెంచీలను సైతం దయానంద రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో చౌట్‌పల్లి సర్పంచ్ మహబూబ్, కమ్మర్‌పల్లి ఎంఈవో, చౌట్‌పల్లి హెచ్ఎం ఆంధ్రయ్య, పీడీ జైడి రాజకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.